రబీలో వరి సాగు వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు!

విశ్వంభర, పెద్దశంకరంపేట: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రబీ సీజన్‌లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని మండల తాసిల్దార్ నారాయణ వ్యవసాయ అధికారి నాగం కృష్ణ సూచించారు. తక్కువ వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధిక నీటి అవసరం ఉండే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసుకునే ఆరుతడి పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దశంకరంపేటలోని ఎరువులు, విత్తనాల దుకాణాలపై సోమవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

వరి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు: తహసీల్దార్ నారాయణ

రానున్న రబీ సీజన్‌లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగు చేపట్టకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని తహసీల్దార్ నారాయణ సూచించారు. దుకాణాల్లో నిల్వ ఉన్న వరి విత్తనాలను సంబంధిత కంపెనీలకు తిరిగి పంపించాలని యజమానులకు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వరి విత్తనాలను విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరుతడి పంటల సాగుపై అవగాహన: నాగం కృష్ణ

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నాగం కృష్ణ మాట్లాడుతూ.. రానున్న రబీ సీజన్‌లో వర్షాలు తక్కువగా కురిసే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలన్నారు. వరికి బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో గ్రామసభల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, నీటి లభ్యతను బట్టి అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకునేలా సూచనలు చేస్తున్నామని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు. ఎరువులు, విత్తనాల దుకాణాల రికార్డులను పరిశీలించి యజమానులకు పలు సూచనలు చేశారు.



బతుకమ్మ కుంట ఘాట్‌లో భక్తిశ్రద్ధలతో ఛఠ్ పూజలు

విశ్వంభర, అంబర్‌పేట :బాగ్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ఘాట్ వద్ద బీహార్ సమాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఛఠ్ పూజ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, బిజెపి నాయకులు చంద్రకాంత్ యాదవ్, శ్రీధర్ గౌడ్ తదితరులు భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. సంఘం పూజా కార్యక్రమాలతో ఘాట్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

కేసముద్రం సీనియర్ ప్రెస్ క్లబ్ ఎన్నిక

- అధ్యక్షుడిగా ఎసల్ల సత్యనారాయణ. ప్రధాన కార్యదర్శిగా గాజుల రవి





విశ్వంభర,కేసముద్రం మండల కేంద్రంలో సోమవారం నాడు జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరిం చుకుని సీనియర్ జర్నలిస్టుల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేసముద్రం సీనియర్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎసల్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కూన శ్రీను, ప్రధాన కార్యదర్శిగా గాజుల రవి, ?కోశాధికారిగా పందుల రవిచంద్ర,సహాయ కార్యదర్శిగా శీలం దామోదర్ లను సీనియర్ పాత్రికేయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎసల్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.దింతోపాటు జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనకై నిరంతరం పోరటం చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సీనియర్ ప్రెస్ క్లబ్ ముందుంటుందని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన తోటి సీనియర్ జర్నలిస్టులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

గిరిజన తండాలకు ప్రత్యేక కరువు ప్యాకేజీ ప్రకటించాలి



విశ్వంభర, హిమాయత్‌నగర్ : ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉన్నందున గిరిజన తండాలు, గూడేలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ కోరారు. సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని డాక్టర్ రాజ్ బహదూర్ గౌడ్ విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ఆవాసాల్లో తాగునీరు, పశుగ్రాస కొరత నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, సమగ్ర సర్వే నిర్వహించి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు. గిరిజన రైతులకు ఎకరానికి రూ.50 వేల కరువు పరిహారం, వ్యవసాయేతర గిరిజన కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతుల బ్యాంకు రుణాల వడ్డీ మాఫీతోపాటు రుణాలను రీషెడ్యూల్ చేయాలని, చేవెళ్ల డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని కోరారు. కరువు నివారణ చర్యలు చేపట్టాలని నవంబర్ 30న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట మహాధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. సమాఖ్యను అన్ని జిల్లాల్లో బలోపేతం చేసి గిరిజన సమస్యలపై ఉద్యమించాలని నిర్మాణ బాధ్యులు పల్లా నరసింహారెడ్డి సూచించారు. సమావేశంలో కల్లూరి వెంకటేశ్వర్లు, జువారి రమేష్, వడిత్య స్వరూప నాయక్, నేనావత్ రూప్ సింగ్, బానోత్ వీరు నాయక్, గూగుల్ రాజారాం, రామావత్ శక్రు నాయక్, మాలోత్ శంకర్ నాయక్, బి. వెంకట్, కృష్ణా నాయక్, బిక్షం నాయక్, ఆర్. దేవీలాల్, గోడ వీరన్న, లింగా నాయక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'జీవన దర్పణం' పుస్తకావిష్కరణ..



విశ్వంభర, కొత్తపేట :రచయిత పేరి నాగేశ్వరరావు రచించిన 'జీవన దర్పణం' పుస్తకాన్ని రక్షిత హాస్పిటల్స్ చైర్మన్ రాంప్రసాద్, బ్రిలియంట్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ సీఈఓ పి.ఎస్.ఆర్. మూర్తి ఆవిష్కరించారు. హైదరాబాద్ దినుసుక్ నగర్ కొత్తపేట లోని న్యూ మారుతి నగర్ అన్నపూర్ణ నిలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ రంగాల ప్రముఖులు, సాహిత్యాభిమానులు, సంగీత కళాకారులు హాజరయ్యారు. కుటుంబ వ్యవస్థ, మానవ సంబంధాలు, వ్యక్తిత్వ వికాసం, ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, విద్య, సంస్కృతి, నైతిక విలువలు తదితర అంశాలను పుస్తకంలో ప్రస్తావించినట్లు రచయిత తెలిపారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావరిలో కళ్యాణి దేశ్‌పాండే, ప్రసన్న విజయ్ కుమార్, సవిత, మల్లాది శైలజ, పి.వి. రమణమూర్తి, ఎం.బి. రవికుమార్, పేరి నాగేశ్వరరావు, విజయలక్ష్మి గీతాలాపనతో అలరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైన సంగీత విభావరి రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. శ్రీ ధ్యుతి మ్యూజికల్ అకాడమీ అండ్ ఇషాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ఇప్పటివరకు 300కు పైగా సంగీత కార్యక్రమాలు, 3 వేలకుపైగా పాటల ప్రదర్శనలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కరోనా సమయంలోనూ 76కు పైగా ఆన్‌లైన్ సంగీత కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పేరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, తులసీరామ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పేరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జీవిత విలువలు, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించడమే తన రచనల లక్ష్యమని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు



విశ్వంభర, పరిగి: మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్ రాములు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఏ గ్రామంలో ఇల్లు నిర్మించిన దాఖలాలు లేవని తెలిపారు. అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలవేలు నర్సింలు, వార్డు సభ్యులు యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ ప్రభు, నాయకులు అశోక్, రవి, లబ్ధిదారురాలు రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ఫ్లెక్సీల ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి: చార్మినార్ డీసీపీకి కాంగ్రెస్ నేతల వినతి

విశ్వంభర, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు, బ్యానర్లను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవా లని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం సోమవారం చార్మినార్ డీసీపీ కిరణ్ ప్రభాకర్ ఖరేకు వినతిపత్రం సమర్పించింది.శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'భారత్ సమ్మిట్' కార్యక్రమానికి రాహుల్ గాంధీ హాజరైన నేపథ్యంలో, ఆయనకు స్వాగతం పలుకుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశాయి. అయితే, బీజేపీకి చెందిన కొంతమంది వ్యక్తులు వాటిని కావాలనే చింపివేసి, ధ్వంసం చేశారని బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నాగేష్, చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌ఛార్జి కె. వెంకటేష్, కాంగ్రెస్ నేత అనిల్ తదితరులు డీసీపీ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, దానిని ఆసరాగా చేసుకుని కొందరు బీజేపీ నేతలు నగరంలో అనవసర గొడవలు, ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరో పించారు. ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులను గుర్తిం చి కఠినంగా శిక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నగరంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని నాగేష్, వెంకటేష్‌లు డీసీపీని కోరారు.

మొగల్పుర పోలీసుల ఫుట్ పెట్రోలింగ్



విశ్వంభర,మొగల్పుర: మొగల్పుర స్టేషన్ పరిధిలోని నాగుల్చింత, లాల్ దర్వాజా రోడ్, దేవి పాన్ షాప్ వరకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల దగ్గరికి వెళ్లి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వివిధ నేర ప్రవృత్తి గల వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను కుటుంబ సభ్యులు తమ వంతు బాధ్యతగా స్వీకరించి దుర్వ్యసనాల బానిస కాకుండా చూడాలని, చుట్టుపక్కల నిశితంగా గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అనుకోని సంఘటనలు కళ్ళ ముందు కనిపిస్తే 100/112 డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శ్రీను, మొగల్పూర్ ఎస్సైలు, ఏఎస్ఐలు, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాకు అత్యధిక చేయూత పెన్షన్లు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: తెలంగాణ రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లాకు అత్యధిక చేయూత పెన్షన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ మండల కేంద్రంలోని ఎన్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు నారాయణ ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి 'చేయూత' పెన్షన్ మంజూరి పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లాకు అత్యధిక సంఖ్యలో చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని, అందులోనూ నారాయణఖేడ్ నియోజకవర్గానికి జిల్లాలోనే అత్యధికంగా పెన్షన్లు రావడం విశేషమని పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండలానికి మొత్తం 344 చేయూత పెన్షన్లు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం సుదీర్ఘకాలం ఎదురుచూసిన అనేక కుటుంబాలు, ముఖ్యంగా దివ్యాంగులు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ఆకాంక్షలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారే తప్ప పేద ప్రజలకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు.ప్రస్తుత ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలి ఉంటే వారిని గుర్తించి, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం వారికి చేరేలా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మరియు ప్రజాప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాణ్యత లేని ఆహారంపై లేడీస్ హాస్టల్ విద్యార్థినుల నిరసన

విశ్వంభర, తార్నక :ఉస్మానియా యూనివర్సిటీ లేడీస్ హాస్టల్‌లో నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థినులు సోమవారం రాత్రి నిరసనకు దిగారు. హాస్టల్‌లో అందిస్తున్న భోజనం నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆహార ప్రమాణాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులకు నాణ్య మైన భోజనం అందించేలా యూనివర్సిటీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వ్యక్తి మృతి

విశ్వంభర, గుండాల:యాదాద్రి-భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం సబ్‌స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం.. సీతారాంపురం గ్రామానికి చెందిన మల్లేపాక సోమయ్య (63) ఈ నెల 15న సాయంత్రం తన భార్యను టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై ఇంటికి తీసుకెళ్తుండగా, మాతురు శేఖర్ అనే వ్యక్తి తన హీరో గ్లామర్ మోటార్ సైకిల్‌పై అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సోమయ్య తీవ్రంగా గాయపడ్డాడు.వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జనగాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నవంబర్ 16వ తేదీ అర్ధరాత్రి 12:10 గంటలకు సోమయ్య మృతి చెందాడు.మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



విశ్వంభర, పెద్ద శంకరంపేట: నారాయణఖేడ్ మండల పరిధిలోని సంజీవన్ రావుపేట్ గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో శాంతిసౌభాగ్యాలను, ప్రజల మధ్య ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి, విగ్రహ ప్రతిష్టాపనకు కృషి చేసిన గ్రామస్తులను, దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్వామివారి కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో గ్రామాలు కళకళలా డాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, పండరి రెడ్డి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రమేష్ చౌహన్,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తరలిరండి

విశ్వంభర, కాచిగూడ :యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ వాక్ - నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డా క్టర్ ఎన్. గౌతమ్ రావు పిలుపుని చ్చారు. హైదరాబాద్‌లోని కాచిగూడ బీజేపీ డివిజన్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించాలని కోరారు. మాదకద్రవ్యాల వ్యసనం నుంచి యువతను కాపాడి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. సమావేశంలో రమేష్ యాదవ్, సంతోష్, సాయి, బల్వీర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నర్సింహ త్వరగా కోలుకోవాలి: యాదవ రెడ్డి



విశ్వంభర,నెల్లికుదురు: మండలంలోని హేమ్లా తండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బానోతు నర్సింహ అనారోగ్యానికి గురై హైదరాబాదు లోని గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి మంగళవారం హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్ కు వెళ్లి నరసింహను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. త్వరగా కోలుకొని ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

నిజాం గుండెల్లో భయం పుట్టించిన బండి యాదగిరి పాట : ఇనాక్



విశ్వంభర, చిక్కడపల్లి :తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం, రజాకార్లు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బండి యాదగిరి తన కలంతో పోరాడారని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో 'ఎందరో మహానుభావులు' కార్యక్రమంలో భాగంగా బండి యాదగిరి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇనాక్ మాట్లాడుతూ.. 'బండెనక బండి కట్టి.. ఏ బండిలో పోతావురో నిజాం సర్కరోడ' అనే పాట నిజాం, రజాకార్లలో భయం పుట్టించింద న్నారు. తెలంగాణ సాయుధ పోరాట కవిగా బండి యాదగిరి చిరస్థాయిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. బండి యాదగిరి జన్మించిన తేదీకి కచ్చితమైన ఆధారాలు లేకపోయినా, తెలంగాణ పోరాట కవిగా ఆయనను స్మరించుకోవడం గానసభ బాధ్యతగా భావిస్తోంద న్నారు. కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, గాయకుడు శ్రీధరం రామసుబ్ర హ్మణ్యం, గాయని రాధారాణి పాల్గొన్నారు.

కోర్టు ధిక్కరణపై చర్యలు తీసుకోవాలి

విశ్వంభర, పెద్ద శంకరంపేట : కోర్టు తీర్పు దిక్కారించేల వ్యవహరిస్తున్న వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత సర్పంచి హయాంలో కొందరు నాయకులు కలిసి తన సొంత భూమి సర్వే నం.50/99లో 20 గుంటల భూమిని అధికారులను తప్పు దోవ పట్టించి పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీనిపై తాను కోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. కోర్టు కేసులో నాకు అనుకూలంగా తీర్పు ఇస్తూ ఆ స్థలం అప్పగించాలని ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. కోర్టు ఉత్తర్వులను బూరుగుపల్లి పంచాయతీ కార్యదర్శి కి ఇచ్చిన రెండు నెలలుగా ఎలాంటి స్పందన లేదన్నారు. ఆదివారం తన స్థలంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా సర్పంచి ఫిర్యాదు చేసి అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ తన స్థలంలోకి రాకుండా అడ్డుకొంటున్న వారిపై అధికారులు తగిన చర్యలు ఆయన తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముస్లింల అభ్యున్నతి, రక్షణకు జిల్లా స్థాయి నూతన కమిటీ

విశ్వంభర,మహబూబాబాద్:జిల్లా కేంద్రంలోనిమినీ నందన గార్డెన్ లో ముస్లింల అభ్యున్నతికి, రక్షణకు పలువురు ముస్లింల సమక్షంలో "ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్"జిల్లాస్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . జిల్లా కమిటీ అధ్యక్షులుగా రిటైర్డ్ జిల్లా అధికారి సయ్యద్ ఖుర్షిద్, ప్రధాన కార్యదర్శిగా నదీమ్ ఇంతియాజ్ అలీ ఖాన్ లను,అలాగే ఉపాధ్యక్షులుగా చాంద్ పాషా, ఫజల్, షేఖ్ బాబా, అస్గర్ , జాయింట్ సెక్రెటరీలుగా మహబూబ్ పాషా, యాఖుబ్ పాషా, షర్ఫుద్దీన్, జానీ మియా, కోశాధికారిగా ఖాజా షబ్బీర్ అహ్మద్ లను, గౌరవ సలహాదారులుగా షేఖ్ యాఖుబ్ అలీ, ఇమాముద్దీన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా ముఖ్తీ అలంగీర్ మాట్లాడుతూ– "ముస్లింలు ఇస్లాం పద్ధతులను పూర్తిస్థాయిలో ఆచరించాలని, పేదవారికి, నిస్సయులకు సహాయం చేయడంలో ముస్లింలు ముందుండాలని"యువత సన్మార్గంలో నడిచి, తల్లిదండ్రులకు ముస్లిం సమాజానికి మంచి పేరు తేవాలని" కోరారు . ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు తెలంగాణ ముస్లిం జే.ఏ.సీ. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ ముస్లిం యువత మంచి భవిష్యత్తుకు,నిస్సహాయులకు సహాయం చేయడానికి, బాధితులను ఆదుకోవడానికి, సమాజంలో పలు దుష్టశక్తుల నుండి ముస్లిం సమాజాన్ని రక్షించుకోవడానికి ఈ సంస్థను స్థాపించామని, ఎవరికీ ఏ ఆపద వచ్చినా మా సంస్థలో సహాయం పొందవచ్చని, ముస్లిం సమాజానికి సేవ చేయడానికి 24 గంటలు కష్టపడుతూనే ఉంటామని, ఏ సమయంలోనైనా సహాయం కోరవచ్చని, సహాయం పొందవచ్చు అని జిల్లా ముస్లింలకు సూచించారు.ఇంకా పలువురు ముస్లింల అభ్యున్నతికి సలహాలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ నయీమ్, హారుణ్, ముబీన్,నజీర్,యూసుఫ్, ఉస్మాన్,షేఖ్ మహమ్మద్, శంషుద్దీన్,సయ్యద్ అహ్మద్